క్లుప్తంగా

చిలువూరులో మెగా వైద్య శిబిరం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరులో ఆర్‌సీఎం చర్చి ఆవరణలో ఆదివారం చిలువూరు విచారణ గురువు రెవ.ఫాదర్ డాక్టర్ చాట్ల మరియదాసు, హ్యాపీ హాస్పిటల్ తెనాలి, రెడ్‌క్రాస్‌ల సౌజన్యంతో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. హ్యాపీ హాస్పిటల్ వైద్యులు పావని, ప్రియాంక, స్త్రీల వైద్యనిపుణురాలు డాక్టర్ శ్వేత, ఎముకల విభాగం డాక్టర్ గురునాథ శర్మ, సాధారణ జబ్బులకు డాక్టర్ శ్రీకాంత్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫాదర్ మరియదాసు, సహాయక గురువు పాపయ్య, ఉపదేసి బాల, ఇందుపల్లి దివాకర్, ఆనంద్, చర్చి పెద్దలు విన్సెంట్ డి.పాల్ పాల్గొన్నారు.

టెంపుల్ హిల్ ఏకో పార్కు వద్ద సందడి



మంగళగిరి: నగరంలోని శ్రీ గండాలయస్వామి కొండపై ట్రెక్కింగ్ ట్రాక్‌కు రోజు రోజుకు వాకర్స్ పెరుగుతున్నారు. పెద్దలతో పాటు పిల్లలను ఆకట్టుకుంటుంది. ట్రెక్కింగ్ కొరకు నగరంతో పాటు విజయవాడ– గుంటూరు నగరాల పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తుండడంతో టెంపుల్ హిల్ ఏకో పార్కుతో పాటు ట్రెక్కింగ్ ట్రాక్ ఆదివారం కోలాహలంగా మారింది. నగరానికి చెందిన రోటరీ క్లబ్ ప్రతినిధులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ప్రత్యేకంగా ట్రెక్కింగ్ నిర్వహించారు. వందలాది మంది వాకర్స్ టెంపుల్ హిల్ ఏకో పార్కులో వాకింగ్ చేస్తుండగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన వాకర్స్ ట్రెక్కింగ్‌పై ఆసక్తి చూపుతూ ఆహ్లాదంతో ఆరోగ్యాన్ని పంచుకుంటున్నారు.

చిన్నారులకు వేసవి విజ్ఞాన శిబిరం

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవుల్లో చిన్నారులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్ బాషా ఆదివారం తెలిపారు. మే నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. అందులో కథ వినటం, చదవడం మా కిష్టం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, మ్యూజిక్, డ్యాన్స్, చెస్, కేరమ్స్ విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. వివరాలకు తాడేపల్లి శాఖా గ్రంథలయంలో సంప్రదించాలని, తల్లిదండ్రులు తమ చిన్నారులకు వేసవి సెలవులు వృథా కాకుండా పై వాటిలో శిక్షణ ఇప్పించాలని నాగూర్ బాషా సూచించారు.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

మంగళగిరి: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. విజయవాడ నుంచి ఓ ఆటోలో పెదవడ్లపూడికి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆటోతో సహా పట్టుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆటోను, డ్రైవర్‌ను రూరల్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన విరామ బైబిల్ పాఠశాల తరగతులు

మంగళగిరి: నగరంలోని పార్కురోడ్డు ఇమ్మానియేలు చర్చిలో ఈనెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్న విరామ బైబిల్ పాఠశాల తరగతులు ఆదివారంతో ముగిశాయి. చిన్నారులకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ బి.రవిప్రకాష్, రోజా, ఆచర్ల రాణి, మేరి ఫ్లోరన్స్, రిచర్స్, ప్రియాంక పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యతో ఉత్తమ ఫలితాలు



పెదవడ్లపూడి.. రమ్యకు బహుమతి అందజేత



దుగ్గిరాల .. శైలజను అభినందిస్తున్న ఎమ్మెల్యే



పదిలో 579 మార్కులు సాధించిన మంగళగిరి విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

- ఎమ్మెల్యే ఆర్కే
- పదిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు

మంగళగిరి: నాణ్యమైన విద్యనందించడంతో పదో తరగతిలో విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలను మించి ఉత్తీర్ణత సాధించారని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. నగర పరిధిలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10 వేల బహుమతి వారి ఇంటికి వెళ్లి ఆదివారం అందజేశారు. నగరంలో రత్నాలచెరువు శ్రామిక నగర్‌కు చెందిన విద్యార్థి పెనం విజయదుర్గ 579 మార్కులు, పెదవడ్లపూడికి చెందిన గుర్రం రమ్య 577 మార్కులు సాధించగా విద్యార్థినులను తల్లిదండ్రులను అభినందించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వ పాఠశాలలను నాడు– నేడు పేరుతో రూపురేఖలు మార్చి అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మల్లవరపు సుధారాణి, అగస్టీన్ పాల్గొన్నారు.

దుగ్గిరాల మండలంలో..

తాడేపల్లిరూరల్: ఉన్నత విద్య ద్వారానే సమాజంలో ఎవరికైనా గుర్తింపు వస్తుందని మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం దుగ్గిరాల మండల వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో చదివి, మొదటి ర్యాంకు సాధించిన శృంగారపురం గ్రామానికి చెందిన విద్యారిని పరసా శైలజ 600 మార్కులకు గాను 573 మార్కులు సాధించడంతో ఆ బాలికను ఎమ్మెల్యే ఆర్కే ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలసి వెళ్లి అభినందించి 10 వేల రూపాయలు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, శృంగారపురం సర్పంచి కొండూరు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో పేదలకు సమన్యాయం

మాల మహానాడు జాతీయ అధ్యక్షులు నత్తా యోనరాజు



మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షులు నత్తా యోనరాజు

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత పేదలకు రాజ్యాధికారం ఇచ్చి పరిపాలన కొనసాగిస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు నత్తా యోనరాజు అన్నారు. దుగ్గిరాల ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడం చరిత్ర అని కొనియాడారు. సీఆర్‌డీఏలో 52 వేల మందికి నివాస స్థలాలు ఇవ్వాలని పూనుకుంటే, చంద్రబాబు నాయుడు బినామీలతో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలు రాజధాని ప్రాంతంలో ఉంటే కులాల మధ్య చిచ్చులు చెలరేగుతాయని, వారికి ఆ స్థలాలు కేటాయించడానికి వీలు లేదంటూ కోర్టులో కేసులు వేయించారు. ఎట్టకేలకు గౌరవ న్యాయస్థానం పేదల పక్షాల ఉండి రాజధాని ప్రాంతంలో నివాస స్థలాలు కేటాయించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆత్మకూరు నాగేశ్వరరావు, మేరుగ ఆనంద్, కాబోతు కర్పూరరావు, ఇమ్మానుయేలు, జాన్సన్ పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకుంటాం

వైఎస్సార్ సీపీ నాయకుడు కత్తెర సురేష్ కుమార్



కల్లాల్లో దెబ్బతిన్న మిర్చిని పరిశీలిస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

రావెల(తాడికొండ): అకాల వర్షాలకు దెబ్బతిన్న మిర్చి పంటను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పరామర్శించారు. రైతులను అడిగి తెలుసుకున్నారు. చేతికందిన పంట ఆరబెట్టుకొని అమ్ముకునే లోపు వర్షాల దెబ్బకు తడిచిపోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వం ద్వారా వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యాన శాఖ ద్వారా రైతులకు టార్పాలిన్ పట్టాలు ఇవ్వాలని పలువురు రైతులు కోరగా ఆ శాఖాధికారులతో మాట్లాడి వెంటనే అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట సర్పంచి రావెల శైలజ, మాజీ ఎంపీపీ కొమ్మినేని రామచంద్రరావు, మాజీ యార్డు వైస్ చైర్మన్ భీమవరపు బ్రహ్మారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్ళ శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచి దేవరపల్లి చినపాములు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా రమేష్ సేవలు అభినందనీయం



కొల్లూరు రమేష్‌ను సత్కరించిన అతిథులు

తెనాలి: తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు రమేష్ ఉద్యోగ విరమణ సభ ఆదివారం స్థానిక కొత్తపేటలోని ఓ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఆహ్వాన కమిటీ కన్వీనర్ డీఎల్ కాంతారావు సభకు అధ్యక్షత వహించారు. తెనాలిలో ఉద్యోగ ప్రస్థానం ఆరంభించి, 41 ఏళ్ల సర్వీసులో వివిధ పదవులను చేపట్టి, డివిజనల్ సూపరింటెండెంట్‌గా తిరిగి ఇక్కడే పదవీ విరమణ చేయడం సంతోషకరమని కాంతారావు పేర్కొన్నారు. అధికారిగా ఉద్యోగులు, ఉన్నతాధికారుల మన్ననలు పొందిన కొల్లూరు రమేష్, ఉమ్మడి రాష్ట్ర ఇన్‌స్పెక్టర్, ఏఎస్‌పీ అసోసియేషన్‌కు దశాబ్ద కాలం నాయకత్వం వహించినట్లు వక్తలు గుర్తుచేశారు. పోస్టల్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2017 నుంచి రమేష్ నేతృత్వంలోనే నడిచిందని తెలిపారు. కార్యక్రమంలో బీవీ సుధాకర్, ఈవీ రావ్, వీవీవీ ప్రసాద్, వేణుగోపాల్, శ్రీధర్ బాబు, వాసిరెడ్డి శివాజీ, బీవీ రావ్, విద్యాసాగర్, శ్రీనివాస్, పవన్, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యరాజ్య సమితి తీర్మానంపై హర్షం

నెహ్రూనగర్: జీసస్ క్రైస్ట్, జఫర్సన్, మోషే, అబ్రహం లింకన్ వంటి మహనీయులతో అంబేడ్కర్‌ను పోల్చుతూ, ప్రపంచ విమోచకుడిగా గుర్తిస్తూ జై భీమ్ అనే నినాదంపై ఐక్యరాజ్యసమితిలోని 204 సభ్యత్వ దేశాలు గత ఫిబ్రవరిలో తీర్మానం చేయడం హర్షించదగ్గ విషయమని ఐడియా (ఐడియల్ దళిత్ ఎంప్లాయీస్ అసోసియేషన్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి తీర్మానం చేసిన అంశంపై అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం పెదగొట్టిపాడు, పెదమక్కెన, అంబేడ్కర్ ఇద్యా మహానగర్‌లకు చెందిన దళితులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ఐక్యరాజ్యసమితి ప్రపంచ విమోచకుడిగా గుర్తించడంతో పాటు జై భీమ్ అనే నినాదాన్ని ముక్తకంఠంతో పలకడం భారతదేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. పార్లమెంటుతో పాటు దేశంలోని అన్ని రాష్ట్ర శాసన సభలు హర్షం వ్యక్తం చేస్తూ చేసిన తీర్మానాల్ని ఐక్యరాజ్య సమితికి పంపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు జొన్నలగడ్డ ప్రభాకర్, పిల్లి శ్యాంసన్, కుమ్మరిగుంట చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ పరీక్షలు



తాడికొండ: తాడికొండ మండలంలో నీట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. లాం, మోతడక గ్రామాల్లోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలల్లో కొనసాగిన ఈ పరీక్షలకు మొత్తం 1152 మంది విద్యార్థులకు గాను 18 మంది గైర్హాజరు కాగా మిగిలిన వారు హాజరయ్యారు. తాడికొండ పోలీసులు పూర్తిస్థాయి బందోబస్తు నిర్వహించి విద్యార్థులు తోపులాటలు లేకుండా క్యూ లైన్‌లు ఏర్పాటు చేశారు.

గంజాయి విక్రేతలు అరెస్ట్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇప్పటంలో గంజాయి అమ్ముతున్న ముగ్గురు యువకులను ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ముగ్గురూ గంజాయి తీసుకు వచ్చి విద్యార్థులకు చిన్నచిన్న పొట్లాలు కట్టి అమ్ముతున్నట్లు తెలుస్తోంది. పోలీసులను వివరణ అడగ్గా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

యోగా శిక్షణ శిబిరం

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని షైన్ ఆనంద శరణాలయంలో శ్రీరాధాకృష్ణ యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ శిబిరం ఆదివారం ప్రారంభించారు. తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై యోగా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమం తప్పకుండా యోగాభ్యాసాన్ని ఆచరిస్తే శారీరక రుగ్మతలే కాకుండా మానసికంగా ఎంతో ఉల్లాసంగా ఉంటారన్నారు. క్రమం తప్పకుండా యోగా ఆచరించడం వలన ఒత్తిడి దూరం అవుతుందని, బాల బాలికలు యోగాలో శిక్షణ ఇవ్వాలనే నిర్వాహకుల ఆలోచన అభినందనీయమన్నారు. నిర్వాహకులతో కలసి తహసీల్దార్ యోగాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యోగా గురువు రాధా కృష్ణ, ఆశ్రమ నిర్వాహకులు డీజీ నాయక్, సంధ్యారాణి పాల్గొన్నారు.

యువతిపై దాడి

తెనాలి రూరల్: ఆకతాయిల్ని ప్రతిఘటించిన యువతిపై దాడి చేసి, గాయపర్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఐతానగర్‌కు చెందిన ఓ యువతి శనివారం రాత్రి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా.. కొందరు గుర్తు తెలియని యువకులు ఆమెను కామెంట్ చేశారు. దీంతో యువతి వారికి ఎదురు తిరిగింది. దీంతో ఆ యువకులు ఆమెపై పదునైన వస్తువుతో దాడి చేశారు. యువతి చేతులకు గాయాలయ్యాయి. బాధిత యువతి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్టు

గుంటూరు రూరల్: బుడంపాడు గ్రామ శివారుల్లో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఎనిమిది మంది జూదరుల్ని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 10 వేలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

దేవాలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలి

ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు



శివాలయంలో శంకుస్థాపనలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: నగర పరిధిలోని దేవాలయాల అభివృద్ధికి భక్తులు, దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కోరారు. స్థానిక గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి(శివాలయం)లో రూ.1.20 కోట్లతో చేపట్టనున్న ఫ్లోరింగ్ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. , ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి హాజరయ్యారు. శివాలయం ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ నేరెళ్ళ లక్ష్మీరాధిక, మురళి దంపతులు చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రెండు వైష్ణవ ఆలయాల మధ్య ఉన్న శివాలయంలో రూ.1.20 కోట్లతో ఫ్లోరింగ్ పనులు చేపట్టనుండగా భక్తులు, దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు కొల్లి మునలారెడ్డి, కొల్లి బాబూరావు, అద్దంకి వెంకటేశ్వర్లు, రేఖా వకుళాదేవి,వైఎస్సార్ సీపీ నాయకులు సంకా బాలాజిగుప్తాలు పాల్గొనగా ఆలయ ప్రధాన అర్చకులు తెలకపల్లి మహేష్‌కుమార్ శర్మ పూజలు నిర్వహించారు.

కళ్లం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

3వ రౌండ్‌కు చేరుకున్న 16 టీమ్‌లు



ప్రతిభ కనబర్చిన క్రీడాకారుడిని అభినందిస్తున్న కళ్లం గోవిందరెడ్డి

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాక గ్రామంలోని జూనియర్ ప్రభుత్వ కళాశాలలో కళ్లం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. మొత్తం 64 టీమ్‌లు పాల్గొనగా రెండో రౌండ్‌కు 32 టీమ్‌లు చేరుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం నుంచి మూడో రౌండ్‌లో మొత్తం 16 టీమ్‌లు తలపడతున్నాయని అన్నారు. మొదటి మ్యాచ్ నాయక్ సీసీ, 11 స్టార్స్ కేపీ సీనియర్స్ జట్ల మధ్య జరగ్గా మొదటగా బ్యాటింగ్ చేసిన నాయక్ సీసీ జట్టు 16 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 109 చేయగా, అనంతరం బరిలోకి దిగిన కేపీ సీనియర్స్ జట్టు 7 వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేయడంతో నాయక్ సీసీ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గోపి నాయుడికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును కళ్లం గోవిందరెడ్డి అందజేశారు. మరో మ్యాచ్‌లో జెస్సికా సీసీ, ఆరా ఫౌండేషన్ జట్ల మధ్య జరగగా జెస్సికా జట్టు 5 వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఆరా ఫౌండేషన్ జట్టు 3 వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన లింక్లాన్ దారుకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వార్డును కళ్లం మహేష్‌రెడ్డి అందించారు.

దెబ్బతిన్న మొక్కజొన్న పంట పరిశీలన



అకాల వర్షం కారణంగా దెబ్బతిన్నమొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెనుమూలిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ మొక్కజొన్న రేకలు తీసిన కండెలు అకాల వర్షాల కారణంగా రంగు మారి, మొలకలు వస్తున్నాయని, నేలపై ఉన్న కండెలు మట్టిలో మొక్కజొన్న దంటు పైకి రెండు సార్లు మార్చినందుకు ఎకరాకు 6 వేల రూపాయలు కూలీ ఖర్చులు అయినట్లు చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంటల నష్టం అంచనా వేసి ప్రతి ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.నాగమల్లేశ్వరరావు, రైతు సంఘం నాయకులు వి.సాంబశివరావు, బి.అమ్మిరెడ్డి, రైతులు వై.బంగారుబాబు, గోపి, టి.మురళీకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నాట్య ప్రదర్శనలు



నాట్యం చేస్తున్న తెనాలి రంగనాయికి శిష్య బృందం



కూచిపూడి నాట్యం చేస్తున్న ఖలీల్ శిష్య బృందం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం అన్నమయ్య కళావేదికపై రాధా మాధవ కల్చరల్ అసోసియేషన్ 25 వసంతాల వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు, తెనాలి, విజయవాడ, వరంగల్‌కు చెందిన వివిధ సంగీత, నృత్య కళాశాలల నిర్వహణలో 300 మంది సంగీత, నృత్య కళాకారులతో మూడు గంటల పాటు 300వ నెలనెలా వెన్నెల ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు రాధామాధవ నాట్యక్షేత్రం నాట్యాచార్య షేక్ ఖలీల్, పూల భరణి నృత్య కళాశాల, నృత్య కళా భారతి ఎస్. బాలు శిష్య బృందం, తెనాలి గురువు బి. రంగనాయకి శిష్య బృందం, విజయవాడ కూచిపూడి డాన్స్ అకాడమీ తదితర కళాశాలల నిర్వహణలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు, భారతీదేవి సంగీత నిలయం గురువు భారతీదేవి శిష్య బృందం వీణా కచేరి ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మిట్టపల్లి రమేష్‌బాబు, ఆలయ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పలువురు ప్రముఖులు పాల్గొని కళాకారులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు, అందించి సత్కరించారు. కార్యక్రమాన్ని నాట్యాచార్య షేక్ ఖలీల్ పర్యవేక్షించారు.

శ్రావ్యంగా మధువని సంగీత విభావరి



పాటలను ఆలపిస్తున్న గాయకులు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో మధువని సుస్వరాల పల్లకి సంస్థ వ్యవస్థాపకులు వెలిశెల మధుబాబు ఆధ్వర్యంలో ఆదివారం స్వర రాగమాలికలు శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథిగా అన్నదాన సమాజం చైర్మన్ పోకల వసంత్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. పలు చిత్రాల్లోని సినీ పాటల్ని గాయకులు బి. భారతి, కె.శైలజ, మధుబాబు, సీహెచ్.రవికాంత్, ఎస్.సాంబశివరావు, సాయిబాబా ఆలపించి అలరించారు. వ్యాఖ్యాతగా పి.కృష్ణారావు వ్యవహరించగా కె.శివప్రసాద్ పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఆదివారం 1990–1995 వసంవత్సరం పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పాఠశాలలో చదువుకొని పలుప్రాంతాల్లో స్థిరపడిన పలువురు విద్యార్థులు కార్యక్రమంలోని పాల్గొని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పుడు తమకు విద్యను నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమాలను అప్పటి పూర్వ విద్యార్థి ప్రస్తుత పాఠశాల కమిటీ చైర్మన్ దొడ్డా నాగిరెడ్డి, పూర్వవిద్యార్థులు తియ్యగూర అంజిరెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, బొల్లయ్య, షేక్. మీరావలి, మస్తాన్‌వలిలు పర్యవేక్షించారు.

సెయింట్ మేరీస్ స్కూల్‌లో సందడి



నాటి ఉపాధ్యాయులతో 1995-96 బ్యాచ్ విద్యార్థులు

తాడికొండ: తుళ్ళూరు మండలం పెద పరిమి గ్రామంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్ 1995–96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహ భరితంగా కొనసాగింది. 27 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని ఆనందంగా గడిపారు. పాఠశాల పూర్వ విద్యార్థి నల్లపు కిషోర్ బాబు సారథ్యంలో సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో నాటి హెచ్ఎం దొపాటి జోజియా, ఉపాధ్యాయులు సుదర్శనరావు, స్లేవరాజు, వైబీ రాజేశ్వరరావు, దుర్గా ప్రసాద్, వై.భాస్కర్ రెడ్డి, కుసుమ కుమారి, పి.లూర్దు సవరయ్య, కె.ఉమా మహేశ్వరరావు, వినయ్ కుమారి, బాల శౌరీ, సెయింట్ మేరీస్ హైస్కూల్ హెచ్‌ఎం నిర్మల, మర్రయ్య పాల్గొన్నారు.